మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని గజ్వేల్ డివిజన్‌లో ఈనెల 11న మొదటి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గజ్వేల్, మర్కుక్, వర్గల్, జగదేవాపూర్, ములుగు, దౌల్తాబాద్, రాయపోల్ మండలాలోని ఆయా గ్రామాల ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి మంగళవారం తెలిపారు. ఎన్నికలలో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని ఈనెల 11న ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం 1గంటవరకు నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనాలని కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు.

## మద్యంసేవించి వాహనాలు నడిపిన 4గురికి జరిమాన

**-ట్రాఫిక్ సిఐ ప్రవీణ్‌కుమార్**

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

మద్యం సేవించి వాహనాలు నడపవద్దని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారికి రూ.10వేల జరిమాన విధించడం జరుగుతుందని ట్రాఫిక్ సిఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్, ఎంపిడివో చౌరస్తాలతోపాటు రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీచేయగా, నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీచేయగా, మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు వచ్చిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్‌క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట మంగళవారం హాజరుపరచగా, విచారణ జరిపి 4గురికి రూ.41 వేలు జరిమాన విధించారని తెలిపారు. రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం అడిషనల్ కలెక్టర్ మాధురి(రెవెన్యూ) ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిఆర్ఓ, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపి సజ్జానార్‌కు జ్ఞాపికను అందచేసిన బధిరులు



సిపి సజ్జానార్‌కు జ్ఞాపికను అందచేస్తున్న బధిరులు

**సిర్గాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడపల్ గ్రామానికి చెందిన బధిర సోదరులు గూడూరి ఆగమప్ప, నాగరాజ (మూగ, చెవుడు)లు మంగళవారం హైద్రాబాద్ సిపి సజ్జానార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పెన్సిల్ ఆర్ట్‌తో వేసిన సజ్జానార్ ముఖం చిత్రపటాన్ని బహూకరించారు. అందంగా చిత్రీకరించిన తన ఫోటోను చూసి సజ్జానార్ సంతోషం వ్యక్తంచేస్తూ నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు.

## అతివల పోరులో అందలం ఎవరికో..?

**-సర్పంచ్ బరిలో ఐదుగురు మహిళలు..**
**-మేజర్ పంచాయతీలో ఉత్కంఠ పోరు..**

**పెద్దశంకరంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

పెద్దశంకరంపేట మేజర్ పంచాయతీ ఎన్నికల ప్రచారం క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తించింది. పట్టణ రాజకీయాల్లో ఎప్పుడూ లేనంతగా ఈసారి పోటీ ఉత్కంఠభరితంగా మారింది. ప్రధాన అభ్యర్థుల మధ్య అతివల పోరులో ఎవరిబలం ఎవరిని అందలమెక్కిస్తుందో అన్న ప్రశ్నపై ఓటర్లలో ఆసక్తి నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెద్దశంకరంపేట మేజర్ పంచాయతీ మహిళలకు రిజర్వ్ అయింది. దీంతో పోటీ తీవ్రత ఎక్కువైంది. మేజర్ పంచాయతీలో 14 వార్డులు కలిపి మొత్తం 6,696 మంది ఓటర్లు ఉన్నారు.

### బరిలో ఐదుగురు మహిళలు..

మేజర్ పంచాయతీ సర్పంచ్ బరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆసూరి చంద్రమురళి పంతులు, ఆర్యన్ మాధవి సంతోష్, ప్రత్యూషరెడ్డిలతో పాటు బిఆర్ఎస్ నుంచి మాజీ ఎంపిపి జంగం శ్రీనివాస్ సతీమణి జంగం రేణుక, బిజెపి నుండి సుమలత శ్రావణ్ కుమార్ పోటీలో ఉన్నారు.

### ఉత్కంఠంగా సాగిన ప్రచారం..

అభ్యర్థులు బృందాలుగా ఉదయం మొదలుకొని రాత్రి వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో త్రాగునీటి ఇబ్బందులు, రోడ్లు, డ్రైనేజీలు వంటి అంశాలు ప్రధానంగా దర్శనమిచ్చాయి. యువత, మహిళల ఓట్లు కీలకమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా మహిళల ఓట్లు ఈసారి కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ ఎన్నికల చర్చ సాగుతుండగా, ఎవరు అందలం ఎక్కుతారు? ఎవరి వాగ్దానాలకు ప్రజలు ఓకే చెబుతారు? అన్న ప్రశ్నలతో పట్టణం మొత్తం ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తుంది. ఎన్నికల పోరులో ఎవరు ముందున్నారు అనేది ఇప్పటికీ స్పష్టంగా తెలియని పరిస్థితి. పార్టీల లెక్కలు వర్గాల బలం, అభ్యర్థుల వ్యక్తిగత చైతన్యం ఈ మూడు కలగలిపితేనే ఫలితాల నిర్ణయం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం. చివరి రోజు ప్రచారంతో పట్టణంలో రాజకీయం మరింత వేడెక్కింది. ఈసారి పంచాయతీ ఎన్నికల ఫలితాలు స్థానిక రాజకీయ గతి మార్చే అవకాశం ఉందన్నది ఎక్కువగా వినిపిస్తుంది. చివరకు ఈ అతివల పోరులో అందలం ఎవరికి దక్కుతుందో గురువారం స్పష్టంకానుంది.

## తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



పాలతో అభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు దృశ్యం

**రామాయంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం రామాయంపేట పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దీక్షలో కూర్చోవటంతో రాష్ట్రం అట్టుడుకిపోయిందని, వెంటనే కాంగ్రెస్ హైకమాండ్ దిగి వచ్చి డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్రం గురించిన కీలక ప్రకటన చేయటం జరిగిందని పిఎసిఎస్ చైర్మన్ బాజీ చంద్రం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు తొలి అడుగుపడ్డ సందర్భంగా, రామాయంపేట తెలంగాణ తల్లి విగ్రహానికి పాలతో అభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల రాములు, అహ్మద్, హస్నుద్దీన్, కిషన్, గొల్ల రాజు, ధాతు, నీల రాజు, సురేష్, ఉద్ది స్వామి, నాగార్జున్, సతీష్, భాను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర

**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**జోగిపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని, పోలింగ్ విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవవారం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారులకు జరుగుతున్న శిక్షణ తరగతులను సందర్శించిన ఆమె పలు సూచనలు చేశారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ, పోలింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించాలని, ఏచిన్న తప్పిదానికి కూడా అవకాశం ఇవ్వొద్దన్నారు. సమయపాలన కచ్చితంగా పాటిస్తూ, సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలింగ్ మెటీరియల్‌ను జాగ్రతగా సరిచూసి తీసుకోవాలని, చెక్‌లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్‌పత్రాలు, ఇతర సామగ్రి ఉన్నాయా, లేవా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్‌కు ముందుగా చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. సీటింగ్ అరేంజ్‌మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి వాటిని నింబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటింగ్ విషయంల గోప్యత నూటికి నూరుశాతం అమలు జరిగేలా చూడాలన్నారు. అనుమతి ఉన్నవారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి రానివ్వాలని సూచించారు. పోలింగ్ విధుల సందర్భంగా అన్ని నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని కోరారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఏమైనా అనుమానాలుంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలని అన్నారు.





శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ప్రిసైడింగ్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

## తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలి

**-కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం**
**-ఆవిష్కరించిన డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్**



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

**మెదక్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటుచేసింది. ఆర్అండ్‌బి ఈఈ వేణు, డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్, ఇతర జిల్లా అధికారులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ భుజంగరావు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతీకగా తెలంగాణ తల్లి నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు మొత్తం 16 అడుగుల ఎత్తు కలిగిన తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ చేసుకోవడం జరిగిందని, తెలంగాణ అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ, తెలంగాణ తల్లి గొప్పదనాన్ని సుదీర్ఘంగా వివరించారు. అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం శుభ పరిణామం అని అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం, ఏర్పాటు చేయడం వల్ల వివిధ పనులపై అక్కడికి వెళ్లే ప్రజలను ఆకట్టుకుంటుందని చెప్పారు. అంతకుముందు జయ జయహే తెలంగాణ గీతాన్ని జిల్లా అధికారులు సిబ్బంది ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ వేణు, డిఈ టెక్నికల్ కరుణ, ఎడబ్ల్యుఈ అరుణ్ రెడ్డి, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, పరిపాలన అధికారి యూనస్, వివిధశాఖల అధికారులు, కలెక్టరేట్ అన్నివిభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించం

**-జోగిపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ**
**-గైర్హాజరైన 11మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు**
**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**జోగిపేట, డిసెంబర్ 09, ప్రభాతవార్త:**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని, నిర్లక్ష్యానికి తగినమూల్యం చెల్లించక తప్పదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. మంగళవారం జోగిపేట ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సదర్శించారు. ఈ సందర్భంగా ఆమె హాజరు రిజిస్టరును పరిశీలించగా, పలువురు వైద్యులు విధులకు హాజరుకాకపోవటంపై కలెక్టర్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వైద్యుల వివరాలు, సిబ్బంది వివరాలు, డిప్యూటేషన్‌పై వారి గురించి కలెక్టర్ ఆరా తీశారు. విధులకు గైర్హాజరైన 11మంది వైద్యులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీచేయాలని డిసిహెచ్‌ఓను ఆమె ఆదేశించారు. ఓపి, డయాలసిస్, ఐసియుతోపాటు అన్ని విభాగాలను ఆమె పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల వినియోగం, శుభ్రత, మందుల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం లేకుండా మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగులకు వైద్య సేవలు అందించటంలో వైద్యులు, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని, చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల వైద్యసిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా కల్టెర్ ప్రావీణ్య వెంబడి ఆర్డీవో పాండు, తహసీల్దారు మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులు నిశితంగా పరిశీలించాలి

**-మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్**





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ. తప్పకుండా అమలయ్యేలా ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్‌రెడ్డి శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగలుగుతారని అన్నారు. ఓటింగ్ గోప్యతను కాపాడేవిధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ, జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల సాధారణ అబ్జర్వర్ కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలక మైనదని, మైక్రో అబ్జర్వర్స్ నిబద్ధతతో అంకితభావంతో పని చేయాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నవారు మినహా, ఇతరు లెవరికీ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. అన్ని అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని దానికి అనుగుణంగా విధులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. శిక్షణ తరగతుల్లో జడ్పి సిఈవో ఇన్చార్జి డిపిఓ జానకిరెడ్డి, శిక్షణ తరగతుల నోడల్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్, మాస్టర్ ట్రైనర్, మైక్రో అబ్జర్వర్లు, పాల్గొన్నారు.

## డప్పూర్ కిరాణ కొట్టులో మద్యం స్వాధీనం

**న్యాల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని డప్పూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం హద్నూర్ పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న కిరాణ కొట్టులో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారరు. గ్రామానికి చెందిన గొల్ల రాజు తన కిరాణా దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 6 ఇంపీరియల్ బ్లూ 180 మిల్లీలీటర్ల బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు.

## చోరీ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు





వివరాలను తెలుపుతున్న ఎస్ఐ

**కొమురవెల్లి, డిసెంబరు 9, ప్రభాతవార్త :**

కొమురవెల్లి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన చోరీ స్నాచింగ్ కేసును పోలీసులు మంగళవారం ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గత నెల 29న ఓ మహిళపై చైన్ స్నాచింగ్ జరగగా బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి విచారణలో భాగంగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆధారాలను సేకరిస్తూ నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు నిందితుడు తిగుళ్ల రజనీకాంత్‌ను అరెస్టు చేసి విచారించగా నిందితుడు నేరాన్ని ఒప్పుకోగా, దొంగిలించిన వస్తువును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని పోలీసులు ఈ సందర్భంగా వివరించారు.

## ఇంటి తాళం పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసిన గుర్తుతెలియని దొంగలు

**నిజాంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన నోముల సునీత ఇంటిలో గుర్తుతెలియని దొంగలు చొరబడి, తాళం పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న ఒక తులం చిన్నచిన్న బంగారు వస్తువులు, 24 తులాల వెండి నగలు దొంగిలించారు. సునీత ఇంటిముందు ఉన్న వీరిశెట్టికి చెందిన ద్విచక్ర వాహనం కూడా దొంగలు అపహరించుకొని తీసుకువెళ్లారు. క్లూస్ టీంను రంగంలోకి దించి దొంగల వేలిముద్రలు సేకరించి బాధితురాలు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాం.

## ఆటో ప్రమాదంలో మహిళ మృతి



కాలువలో పడ్డ ఆటో

**రామాయంపేట మున్సిపాలిటీ, నార్సింగి డిసెంబరు 9, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన నార్సింగి మండలం వల్లూరు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూని సత్తెమ్మ (40) జాతీయ రహదారి 44 మధ్యలో జీఎంఆర్ సంస్థలో కూలీగా పని చేస్తోంది. రోజు వారీగా మంగళవారం నాడు రోడ్డు మధ్యలో పూల మొక్కలను శుభ్రం చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుక నుండి వస్తున్న ఇన్నోవా కారు ముందున్న ఆటోను ఢీకొనడంతో ప్రక్కనే నడుచుకుంటూ వెళుతున్న మహిళ ఆటో తో పాటు పక్కనే ఉన్న కాలువలో పడి అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన స్థానిక ఎస్సై సృజన కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే స్వగ్రామంలో సర్పంచ్ బరిలో 7గురు

**-ఆసక్తిగా మారిన బోరంచ రాజకీయం**

**మనూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**

ఈ నెల 17న జరుగనున్న పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగ్రామమైన బోరంచలో సర్పంచ్ బరిలో 7గురు అభ్యర్థులు సర్పంచ్ పోటీకి సై అంటుండంతో మండలంలో పోటీ చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ కోసం 16మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలుచేసి ఉండగా మంగళవారం 9మంది నామినేషన్‌లను ఉపసంహరించుకోగా బరిలో 7మంది అభ్యర్థులు ఉన్నారు. పంచాయతీ జనరల్‌కు రిజర్వు కావడంతో పోటీ చేసేందుకు అధికులు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల బరిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మద్దతులో ఇద్దరు చొప్పున, మరో ఇద్దరు స్వతంత్రులుగా, మరో వ్యక్తి బిజెపి మద్దతులో పోటీకి సై అంటూ సిద్ధమవుతున్నారు.



సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**జహీరాబాద్, డిసెంబరు 9, (ప్రభాతవార్త):**
కాంగ్రెస్ అధినేత, పార్లమెంట్ సభ్యురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం జహీరాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల అధ్యక్షులు పి.నరసింహారెడ్డి, ఎంపి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఖాజామియా, మాజీ కౌన్సిలర్ రాములు నేత, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భీమయ్య, నాయకులు ఎండి మోహిజ్, వినాయక్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

**శేఖాపూర్‌లో జన్మదిన వేడుకలు...**
మండల పరిధిలోని శేఖాపూర్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేసి ఒకరికి ఒకరు నోటిని తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో తాలుకా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ అస్మా, నాయకులు ఇమామ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల అకాంక్షను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీకే

**సిద్దిపేటలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు**

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 9, ప్రభాతవార్త :**
తెలంగాణ ప్రజల అకాంక్షను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, ఎంపి సోనియాగాంధీకే దక్కుతుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సోనియాగాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరుల త్యాగాలను గుర్తించిన సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాకి అనంద్, సతీష్, కలీం, గ్యాదరి మధు, గయాజుద్దీన్, వహబ్, అజ్మత్, రషద్, హర్షద్, మున్నా, ఎర్ర మహేందర్, ఎల్లవ్వ, భవాని,సంతోషి, విజయ్, గుండు రవితేజ, సీతాబాలు తదితరులు పాల్గొన్నారు.

**టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో...**
టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రదాత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి రాజు, కొండలవాడి సతీష్, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**
అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం నంగునూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.డి.ఇమ్రాన్, సాదుల పవన్‌కుమార్, బడే అశోక్, బోజు రాములు, బడుగు సదానందం, పల్లపు భాను, శ్రీధర్, నగేష్, నవీన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియాగాంధీ

**గజ్వేల్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆదేశాల



గజ్వేల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మొనగారి రాజు, నక్క రాములు గౌడ్

మేరకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి సోనియాగాంధీ చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ



సోనియా గాంధీ జన్మదినవేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

అన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు వద్ద, ప్రజ్ఞాపూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండి.షరీఫ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, కొమురవెల్లి డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మాజీ అధ్యక్షుడు సమీర్, జహీర్, ఆంజనేయులు, బిసిసెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివులు, మన్నె అరుణ్‌కుమార్, పూజారి శ్రావణ్‌కుమార్, కప్పు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా జన్మదిన వేడుకలు

**సదాశివపేట, డిసెంబరు 9 (ప్రభాతవార్త):**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ అధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం ఎంఆర్‌ఎఫ్ అధ్యక్షులు కొత్త గొల్ల చంద్ర శేఖర్, ఆత్మ కమిటీ డైరెక్టర్‌లు రాములు గౌడ్,సాబేర్, మాజీ కౌన్సిలర్ లు గుండు రవి కుమార్,నాగరాజు గౌడ్,ఈశ్వర మార్కండేయ మందిర చైర్మన్ వెంకన్న బాబు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కళావతి,కాంగ్రెస్‌పార్టీనాయకులు,విరన్న స్వామి, తుకారాం,శరత్ చంద్ర,బిట్ల ప్రేమ్ కుమార్ క్రాంతి కుమార్, యాదగిరి ,రహమత్ 8వ వార్డ్ కార్యకర్తలు కరీం భాయ్,సలీం భాయిలక్ష్మణు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులను ఆదరించి గౌరవించాలి

### ఎమ్మెల్యే సునీతా రెడ్డి

**నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఘనంగా సన్మానం..**

**నర్సాపూర్,డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను ఆదరించి గౌరవించాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ అఫ్ స్నేహబంధం నర్సాపూర్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ హానరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరు కాగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రామాయంపేట మాజీ ఎమ్మెల్యేలు వాసుదేవారావ్, విట్టల్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధులందరినీ శాలువాలతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధం నర్సాపూర్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అఫ్ స్నేహబందు నర్సాపూర్ ద్వారా స్వర్గీయ వాకిటి లక్ష్మారెడ్డి ఆశయ సాధన కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ బందు ద్వారా ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టామన్నారు. మొట్టమొదటగా లయన్స్ క్లబ్ స్థాపించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు. అంతేగాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదల కోసం కంటి ఆసుపత్రి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండగా వృద్ధులను ఆక్కున చేర్చుకొని ఆదరించే వారన్నారు. అయితే ప్రస్తుత కాలంలో ఉద్యోగాల పరుగులలో




నర్సాపూర్ లో లయన్స్ క్లబ్ అఫ్ స్నేహబంధు నర్సాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ హానరింగ్ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ లను శాలూవాలతో సన్మానిస్తున్న దృశ్యం

వృద్ధులను పూర్తిగా మర్చిపోయి పట్టించుకోకుండా వృద్ధాశ్రమంలో చేర్పించడం జరుగుతుందన్నారు. వయోవృద్ధుల పట్ల ప్రేమ ఆప్యాయత మర్యాద చూపించవలసిన అవసరము ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులను బాగోగులు చూసుకోని కొడుకులకు తండ్రి సంపాదించిన ఆస్తిలో భాగం ఇవ్వరాదని, తల్లిదండ్రుల బాగోగులు చూసుకొని కొడుకుల ఆస్తుల జప్తు చేసే చట్టాలను తీసుకురావాలన్నారు. తాను మహిళా కమిషన్ చైర్పర్సన్ గా ఉన్నప్పుడు తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం లేదని తనను ఆశ్రయించిన అప్పుడు కొడుకులు నుండి తిరిగి వారి ఆస్తులను అప్పగించడం జరిగిందని తెలిపారు. నర్సాపూర్ లో అసంపూర్తిగా నిలిచిపోయిన సీనియర్ సిటిజన్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను సన్మాన కార్యక్రమానికి రావడం తన అదృష్టమని ఎమ్మెల్యే సునీత రెడ్డి పేర్కొన్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధం నర్సాపూర్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్లను సన్మానించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు నర్సాపూర్ అధ్యక్షులు రాఘవేంద్రరావు, జోన్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, గవర్నర్ అమర్నాథ్ రావు, సెక్రెటరీ అశోక్ కుమార్, ట్రెజరరీ వెంకట్ స్వామి గౌడ్, పిడీసీ గవర్నర్స్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఓబుల్ రెడ్డి, వ్యాఖ్యాత నరసింహారెడ్డి, ఆర్గనైజర్ జైపాల్, సభ్యులు రింగుల ప్రసాద్, మాణిక్యం గౌడ్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు.. విజయానికి మెట్టు

**గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన సింక్రొనీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ హెడ్ ప్రవేష్ శర్మ**

**పటాన్ చెరు, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
విద్యార్థులకు అభిరుచి ఉన్న ఒక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించడం వల్ల కొత్త వాటికి అనుగుణంగా సులువుగా మారవచ్చుని, త్వరగా నేర్చుకోవచ్చుని సింక్రొనీలో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ హెచ్.ప్రవేష్ శర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం విద్యార్థులతో వైర్ లెస్ నెట్ వర్కులలో భద్రతా సవాళ్లు, సాంకేతికతల్లు అనే అంశంపై ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థి జీవితం నుంచి అనుభవజ్ఞుడైన వృత్తినిపుణుడిగా తన ప్రయాణం యొక్క స్ఫూర్తిదాయకమైన కథనంతో ప్రారంభించి, విద్యార్థులను ప్రశ్నలు అడమని ప్రోత్సహించడమే గాక, చురుకుగా ఉండడం, స్పష్టత కోసం వారిని ప్రేరేపించారు. అభివృద్ధి, రూపకల్పన, విస్తరణ వరకు సాంకేతికత యొక్క మొత్తం జీవితచక్రంలో భద్రత యొక్క ప్రాముఖ్యతను శర్మ నొక్కి చెప్పారు. సైబర్ భద్రత వేగంగా విస్తరిస్తోందని, ప్రభుత్వ రంగంతో పాటు మంచి కెరీర్ అవకాశాలు, అధిక వేతనంతో కూడిన మంచి డిమాండ్ ఉన్న రంగమని ప్రవేష్ శర్మ తెలియజేశారు. విద్యార్థులు ఇష్టంతో నేర్చుకోవాలని, విస్తృతంగా అధ్యయనం చేయాలని, ఈ రంగంలో రాణించాలనే ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. డేటా సైన్స్, కృత్రిమ మేధస్సులతో సంభవిస్తున్న ప్రధాన మార్పును శర్మ అంచనా వేస్తూ, అభివృద్ధి చెందుతున్న ఐటీ ల్యాండ్ స్కేప్ పై లోతైన అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాలను నిరంతరం నేర్చుకోవడం, కొన్నింటిని వదిలేయడం కూడా అవశ్యమన్నారు. సంచార్ సాథీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవేశ శర్మ

యాప్ పై ఒక ప్రశ్నకు జవాబిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన డిజిటల్ భద్రతా చర్యలను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రవేష్ శర్మ వివరించారు. డిజిటల్ సాంకేతికతపై అంతగా అవగాహన లేని సామాన్య ప్రజలను సైబర్ బెదిరింపులకు గురిచేస్తున్నట్టు ఆయన గుర్తించారు. సైబర్ భద్రతా సంఘటనలు, సైబర్ దాడులను నివారించడంలో ముందస్తుగా గుర్తించడం చాలా కీలకమని ఆయన స్పష్టీకరించారు. గీతం అక్రిడిటేషన్, ర్యాంకింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.మంజునాథాచారి అతిథిని విద్యార్థులకు పరిచయం చేయగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ జానీ బాషా వందన సమర్పణ చేశారు. ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ చెన్నుపాటి సుమంత్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న అధికారులు

## ఎస్ఆర్ నాయక్ నగర్ పార్కును మరింత అభివృద్ధి చేయాలి

**నిజాంపేట్, డిసెంబర్ 9, ప్రభాతవార్త**
ఎస్ఆర్ నాయక్ నగర్లో వాకింగ్ ట్రాక్ సరిగా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆలూ రి వెంకట శేషాచారి గుబ్బల లక్ష్మీ నారాయణ గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ కా ర్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఉప కమిషనర్‌కి జిహెచ్ఎంసి పార్కుకి సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించి ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషచారి, సీనియర్ నాయ కులు గుబ్బల లక్ష్మీ నారాయణ వివరణ కోరగా మంగళవారం జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్ పాపమ్మ, యుగంధర్ రెడ్డి, జిహెచ్ఎంసి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రూమ్‌కు సంబం ధించి ఎస్టిమేషన్ పంపించామని మిగతావి సంబంధిత డిపార్ట్మెంట్‌కు ఫార్వ ర్డ్ చేయడం జరిగిందని త్వరలో ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పడం జరిగింది. వాకింగ్ ట్రాక్ సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడతామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూర పాటి ప్రభాకర్, పొన్నాడ శ్రీనివాస్, నూక రాజు, వల్లూరి ప్రసాద్, సోమే శ్వరరావు, ప్రవీణ్, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాసవిమాత ఆలయ నిర్మాణానికి తోడ్పడండి : విజయ్‌కుమార్ గుప్తా

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 9 ప్రభాతవార్త**



మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకు వినతిపత్రం సమర్పిస్తున్న చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా, సంఘ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని చింతల్‌లో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయ నిర్మా ణానికి ప్రభుత్వస్థలాన్ని కేటాయించి సహకరించా లని చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా విజ్ఞప్తి చేశారు. మంగళవారం మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకు ఆర్యవై శ్యసంఘ ప్రతినిధులు తరలివెళ్ళి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ యావత్ కుత్బుల్లాపూర్ మండలానికే కేంద్ర బింధువైన చింతల్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గాను 1500గజాల ప్రభుత్వస్థలం కేటాయించాల ని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా మేడ్చెల్ మ ల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా 15రోజులలో సమాధానమిస్తామని హామీఇచ్చిన ట్లు తెలిపారు. ఈసందర్భంగా చింతల్ కుత్బుల్లా పూర్ ఆర్యవైశ్యసంఘ ప్రధానకార్యదర్శి మహాం కాళ ప్రభురాజ్‌గుప్తా, సంఘ ప్రతినిధులు జూ లూరు వీరేందర్‌గుప్తా, నేతి జగన్నాధం గుప్తా, నల్లనాగుల సంతోశ్‌కుమార్, ఇళ్ళెందుల క్రిష్ణకు మార్‌గుప్తా, నారాయణ ప్రసాద్‌గుప్తా, గోపారకు ఆంజనేయులు గుప్తా, గోపారపు శ్రీనివాస్‌గుప్తా, బెజగం రాజుగుప్తా, సత్యప్రసాద్‌గుప్తా, కె.శ్రీని వాస్, చొక్కారపు శ్రీనివాస్, చంద్రశేఖర్‌గుప్తా, రమేశ్‌గుప్తా, నవీన్‌గుప్తా, తాటిశెట్టి ఆంజనేయు లు తదితరులు జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆటో ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ నుండి మెయిన్ రోడ్ వైపుగా ఓ వ్యక్తి వెళ్తుండగా ఆటో ఢీ కొట్టింది. మృతుని వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, మృతుడు యాష్ కలర్ రైన్ కోట్, తెలుపు రంగు గల్లా చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వెంట్రుకలు పాక్షి కంగా తెలుపు రంగులో ఉన్నాయని తెలి పారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసినచో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లోని 9490617229, 8712663248 నెంబర్‌లో సంప్రదించగలరని తెలిపారు.

## బాలిక అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

**కంటోన్మెంట్, డిసెంబర్ 9 ప్రభాతవార్త:**
అబంశుభం తెలియని 13 యేండ్ల మైనర్ దళిత బాలికపై అత్యాచారం జరిపిన ఓ వ్యక్తిని తుకా రాంగేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్డగుట్టలో నివాసం ఉంటున్న నరేందర్ 25, వృత్తిరీత్య అటో డ్రైవర్, వారి ఇంటి ముందు నివాసం ఉంటున్న 13 యేండ్ల మైనర్ బాలికను భయభ్రాంతులకు గురి చేసి తన ఇంట్లోకి రప్పించుకొని ఈ నెల 7వ తేదీని రాత్రి మైనర్ బాలికపై అత్యాచారం జరిపాడు. విషయాన్ని తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు చెబుతే హతం చేస్తానని బెదిరించాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి ఫోక్సో,ఎస్సీ,ఎస్టీ అత్యాచారం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.



బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న మెతుకు భాస్కర్

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేసిన భాస్కర్

**గజ్వేల్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):**
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 16వ వార్డుకు చెందిన నర్సి అశోక్ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన తోటి స్నేహితుడు మెతుకు భాస్కర్ మంగళవారం అశోక్ కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె వెంకటేష్, గుండ్ర రామచంద్రం, మెతుకు సాయిబాబా, డాకని నర్సింగరావు, గుండ్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పులిహోర పంపిణీ చేస్తున్న దృశ్యం

## సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా పులిహోర పంపిణీ

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):**
సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, అత్తెల్లి లక్ష్మయ్య, దొంతుల సత్యనారాయణ, గంగిశెట్టి ఉమేష్, వెంకటేశం, మల్యాల భద్రయ్య, కైలాస శ్రీకాంత్, ప్రశాంత్, సిరిపురం సత్యనారాయణ, జగ్గయ్యగారి శ్రీనివాస్, కాపర్తి సంతోష్, కొమురవెల్లి సంపత్, నోముల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 11న నర్సాపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**నర్సాపూర్,డిసెంబరు 9, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో గురువారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మెడివిజన్ కంటి ఆసుపత్రి హైదరాబాద్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి గంగారాం, కోశాధికారి యాకుబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో అనుభవం గల డాక్టర్లచే కంటి చూపు పరీక్ష నరముల పరీక్ష లోవిజన్ పరీక్ష,కళ్ళజోడు పరీక్షలు, కంటి పరీక్షలు, గ్లకోమా రెటీనా పరీక్షలు చేయబడును అని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి రిటైర్డ్ అయిన ఉద్యోగులతో పాటు ప్రతి ఒక్కరూ హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని నర్సాపూర్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి గంగారాం, కోశాధికారి యాకూబ్ లు కోరారు .

## హెచ్‌హెచ్‌ఎఫ్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత భోజనం

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** 2018లో సంగారెడ్డిలో స్థాపితమైన హెల్ప్ హుమ్యానిటీ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) సహకారంతో నిత్యం ఉదయం 11.30 గంటలకు ఉచిత ఆహారం అందచేస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం 100 మందికి ఉచిత భోజనం అందచేశామని ప్రోగ్రాం ఛీఫ్ గెస్ట్‌లు డాక్టర్ కే రాజ్‌కుమార్, యాకూబ్ అలీలు తెలిపారు. ఉచిత భోజన కార్యక్రమం నిత్యం కొనసాగుతుందన్నారు.

## 4 పంచాయితీలు ఏకగ్రీవం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండలంలోని గంగారం తండా, రత్నానాయక్ తండా, కోండ్యా నాయక్ తండా, కేశ్వార్ పంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయి. ఆయా పంచాయితీలకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఆయా పంచాయితీలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.



సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచులు, మమతామహేశ్‌గౌడ్, రూప్‌సింగ్‌నాయక్

## సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

**మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్**

**ఘట్‌కేసర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఎఐసీసీ అగ్రనేత్రి సోనియాగాంధీ చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం సిద్దించిందని మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద వైఎస్ఆర్ కార్యాలయంలో మంగళవారం రాజ్యసభసభ్యురాలు సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఘణాపూర్ మాజీ సర్పంచులు వేముల మమతాగౌడ్, నానావత్ రూప్‌సింగ్‌నాయక్‌లతో కలిసి మహేశ్‌గౌడ్ కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, కొమురవెల్లి దేవస్థాన డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యురాలు వేముల శోభ, గుర్జకుంట నర్సింహ్మా, వేముల శంకర్‌గౌడ్, నానావత్ సురేశ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు వేముల మణిశరణ్‌గౌడ్, మండల శరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్డియాక్ హెల్త్‌క్యాంప్

**హైదరాబాద్,డిసెంబరు 9,ప్రభాతవార్త:**
సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్డియాక్ హెల్త్ క్యాంపుకి అనూహ్యమైన స్పందన వచ్చింది. తరచుగా జర్నలిస్టులు హార్ట్ అటాక్స్ కి గురవడం, సడెన్ కార్డియా క్ డెత్స్ కావడం వల్ల జర్నలిస్టుల గుండె ఆరోగ్యం కోసం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఈ క్యాంపును నిర్వహిం చింది. వృత్తి, ఉద్యోగాలే ప్రాధాన్యాలుగా స్ట్రెస్ తో సావాసం చేస్తూ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేసేవాళ్లే ఎక్కువ. నాకేం కాదులే.. అనుకుంటూ స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవడానికి వెనుకాడుతుంటారు. కానీ ప్రస్తుతం మన మాడ్రన్ లైఫ్ స్టయిల్ వల్ల 30 ఏళ్లలోనే గుండెపోట్లు, సడెన్ కార్డియాక్ డెత్స్ అవుతున్నాయి. నాకెందుకు వస్తుందులే.. నేను హెల్దీగానే ఉన్నాను.. అని అనుకోకుండా, అందుకే అందరూ కార్డియాక్ హెల్త్ పైన దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు జూబ్లీహిల్స్ అపో లో కాథ్ ల్యాబ్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డి యాలజిస్ట్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ కుమార్ మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన కార్డియాక్ హెల్త్ క్యాంపుకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ చలికాలంలో చల్లని వాతావరణం గుండెను బలహీనం చేస్తుందనీ, చలి వల్ల గుండె రక్తనాళాలు కుచించుకు పోయే అవకాశం ఉండటం, ఫ్లూ లాంటి వ్యాధుల ప్రభా వం వల్ల ఈ సీజన్ లో గుండెపోట్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. మహిళల్లో గుండెపోట్లు తక్కువని అనుకుంటాం. కానీ జర్నలిజంలో ఉన్న మహి ళల్లో ఒత్తిడి మరింత ఎక్కువ. కాబట్టి వాళ్లలో కూడా గుండెపోట్ల



హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న డాక్టర్లతో ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించా రు. ఈ క్యాంపులో బీపీ, ఈసీజీ, 2డి ఎకో, బీఎంఐ, డెంటల్ టెస్టులను నిర్వహించారు. 200 మంది వరకు టెస్టులు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేశ్ వరికుప్పల డాక్టర్ శ్రీనివాస్ కుమార్, ఇతర డాక్టర్లను సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లు అరుణ అత్తలూరి, ఎ.రాజేశ్, జా యింట్ సెక్రటరీలు హరిప్రసాద్ చిలుకూరి, బాపూరావు, ట్రెజరర్ రమేశ్ వైట్ల, ఈసీ మెంబర్లు రచన ముదుంబై, నాగరాజు, సత్తిబాబు, అశోక్ లకు జర్నలిస్టులు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకుందాం

-మండల ప్రజలు, అభ్యర్థులకు ఎస్ఐ రవిగౌడ్ సూచన

**కల్హేర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థులు, మండల ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకునేందుకు తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని కల్హేర్ పోలీసు ఠాణా ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎస్ఐ రవిగౌడ్ మండల ప్రజలకు, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థు(సర్పంచ్, వార్డు సభ్యులు)లకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఓట్ల కోసం డబ్బులు పంచడం గాని, డబ్బులు తీసుకోవడం కాని చేయవద్దన్నారు. 50వేల రూపాయలకు మించి ప్రజలు డబ్బు తమ వద్ద ఉంచుకుని ప్రయాణం చేయవద్దన్నారు. గొడవలకు తెరలేపవద్దన్నారు. రాత్రివేళలో గుంపులుగా తిరగటం కాని, మద్యం సేవించి తిరగటం చేయవద్దన్నారు. రాజకీయ ఒత్తిడులు, బెదిరింపులు, బలవంతపు చర్యలు చేయరాదన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలు, వీడియోలు పెట్టకూడదన్నారు. కూడళ్ల వద్ద గుంపులుగుంపులుగా ఉండకూదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేక సహాయక బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు ర్యాలీలు, మైకులు వాడేందుకు, సమావేశాలు జరుపుకునేందుకు ముందస్తుగా తహసీల్దార్ అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ రవిగౌడ్ మండల ప్రజలకు సూచించారు.

## హరిచంద్రనాయక్ తండా సర్పంచ్‌గా అరుణజ్యోతి

-ధృవీకరణ పత్రం అందచేసిన అధికారి

**జహీరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండల పరిధిలోని హరిచంద్రనాయక్ తండా సర్పంచ్‌గా అరుణజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ధృవీకరణ పత్రం అందచేశారు. గ్రామ సర్పంచ్‌తో పాటు ఆయా వార్డులు సైతం ఏకగ్రీవం అయ్యాయి. గ్రామ పంచాయతీ ఏకగ్రీవానికి సహకరించిన మాజీ జడ్పిటిసి సభ్యులు కిషన్‌రావు, ఎఐటిఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వినయ్ పవార్, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, గ్రామ ప్రజలకు సర్పంచ్‌గా ఎన్నికైన అరుణజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

## తిమ్మాపూర్ అంగన్‌వాడీలో ప్రీక్రిస్మస్ వేడుకలు



తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ క్రిస్మస్ వేడుకల దృశ్యం

**మనూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి లలితాకుమారి మంగళవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లలితాకుమారి తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని సౌకర్యాలను, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇంచార్జి సిడిపిఓ ఎస్.సుజాత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

## కెసిఆర్ దీక్షా ఫలితమే తెలంగాణ



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కెసిఆర్ 11 రోజుల పాటు చేపట్టిన దీక్షా ఫలితంగానే 2009 డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిందని అది ఒకచరిత్ర అని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. బిఆర్ఎస్ పిలుపు మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సూచనతో సిద్దిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దీక్షా విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కోటిలింగాల దేవాలయం ఆవరణలోగల తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, బిఆర్ఎస్ నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, మచ్చ వేణు గోపాల్‌రెడ్డి, గూడాల శ్రీకాంత్‌గౌడ్, సాయిరాం, కాముని శ్రీనివాస్, బాల మల్లు, సత్యనారాయణ, ఇర్షాద్‌హుస్సేన్, కరాటే కృష్ణ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, 18 సంవత్సరాలు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనాలు నడపాలన్నారు. విద్యార్థులు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళే సమయంలో, రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్‌ను సన్మానిస్తున్న మాణిక్ ప్రభు పాఠశాల బాధ్యులు

**జహీరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా భారీ మెజార్టీతో విజయం సాధించిన గడ్డం జనార్ధన్‌ను పట్టణంలోని మాణిక్ ప్రభు పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారెల్లి వెంకటయ్య, ఉపాధ్యాయులు మధు, శివశంకరర్, నర్సింలు, అరుణ, నాగలక్ష్మి, మాణిక్యమ్మ, సువర్ణ, రాజేశ్వరి, పద్మశాలి సంఘం సభ్యులు గడ్డం పాండు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరాలి!

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



జోగిపేట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**జోగిపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా రాణించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం జోగిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, శుభ్రతను, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. తరగతుల్లో చదువుతున్న విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటిస్తూ సిలబస్ పూర్తయిందా, లేదా, బోధనావిధానం ఎలా ఉంది, పాఠాలు అర్థం అవుతున్నాయా, ఏమైనా సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి, చదువులో ముందుండాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతిరోజు పునశ్చరణ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలిని మొత్తం విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు, బోధన, తరగతుల నిర్వహణకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థుల పూర్తి హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సిలబస్‌ను నిర్ణీత సమయానికి పూర్తిచేసి, రివిజన్ క్లాసులను నిర్వహించాలన్నారు. విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాల సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్‌వెంట రెవెన్యూ డివిజినల్ అధికారి పాండు, తహసీల్దారు మధుకర్‌రెడ్డి, ఇంఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సుధ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

-ఎంపిడివో విక్రమ్

**మర్కుక్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఈనెల 11వ తేదీన జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మర్కుక్ మండల అభివృద్ధి అధికారి, జిల్లా సహాయ ఎన్నికల అధికారి విక్రమ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీ బుధవారం మర్కుక్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేయడానికిగాను ఐదు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రిని తీసుకున్న సిబ్బందిని భోజనానంతరం మూడురూట్లుగా విభజించి వారికి కేటాయించిన గ్రామాలకు బస్సులద్వారా తరలించడం జరుగుతుందన్నారు. ఈనెల 11న ఎన్నికలు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ ఉటుందని, 2 గంటల నుండి ఓట్ల లెక్కింపుతోపాటు గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఉపసర్పంచ్‌లను కూడా నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలో 16గ్రామపంచాయతీలకుగాను 2గ్రామాలు ఎర్రవల్లి, నర్సన్నపేట సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంకాగా, మిగతా 14గ్రామాలతోపాటు నర్సన్నపేటలో నాలుగు వార్డులకు ఎన్నికలు జరుగనున్నట్లు పేర్కొన్నారు.

## నర్సాపూర్‌లో దీక్షాదివస్ సంబరాలు

-పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



దీక్షాదివస్ సంబరాల్లో బెలూన్‌లను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్రం కోసం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దీక్షాఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నాయకుల అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా తెలంగాణ దీక్షాదివస్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణతల్లి చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత బిఆర్ఎస్ నాయకులు కలిసి గాలిలో బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ 10సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



బస్వాపూర్‌లో ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**పుల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బస్వాపూర్‌లో సాగవుతున్న ఉద్యానవన పంటలను మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.నిర్మల, డాక్టర్ కె.అరుణ, కె.రాహుల్ విశ్వకర్మలు నిమ్మ తోటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు హనుమంతు, రాములు, రైతు విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



గ్రంథాలయ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**రామచంద్రాపురం, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, కుమార్ గౌడ్, ప్రమోద్ గౌడ్, ఎంఈఓ పిపి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారహోరుతో మారుమ్రోగిన గ్రామాలు

**సదాశివపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
సదాశివపేటమండలంలోని ఒకగ్రామం మినహా 29గ్రామాలలో మంగళవారం పోటీచేసే అభ్యర్థుల ప్రచారాలతో గ్రామాలు మారుమ్రోగాయి. టిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లుగా ప్రజలకు వాగ్దానాలు గుప్పిస్తూ ముమ్మరంగా ఇంటింటిప్రచారం చేశారు. ఇరు పార్టీలలో రెబల్స్ బెడద ఎక్కువగా ఉండటం వలన ఫలితాలు విచిత్రంగా ఉండే అవకాశం ఉంది. సదాశివపేట మండలంలోని 30గ్రామ పంచాయతీలలో ఒక గ్రామం ఏకగ్రీవం కావడంతో మిగిలిన 29గ్రామాల పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సర్పంచ్ పదవి కోసం 29 గ్రామపంచాయతీలకుగాను 87 మంది పోటీ చేస్తుండగా 272 వార్డు మెంబర్లకుగాను 12 వార్డులు ఏకగ్రీవం కావడంతో, మిగిలిన 260వార్డులకు 629మంది పోటీ చేస్తున్నారు. 3076 ఓట్లతో అత్యధికంగా ఓటర్లు కలిగిన ఆత్మకూర్ పంచాయతీకి సర్పంచ్ బరిలో ముగ్గురు పోటీచేస్తుండగా, అత్యల్పంగా 293 ఓట్లు కలిగిన ముబారక్‌పూర్(బి) పంచాయతీ సర్పంచ్‌బరిలో నలుగురు అభ్యర్థులు పోటీచేస్తున్నారు. ఆరూర్, బొబ్బిలిగామ, చందాపూర్, ఇశ్రీతాబాద్, కంబాలపల్లి, కొల్కూర్, మాలపాడు, నాగులపల్లి, నిజాంపూర్, తంగడిపల్లి, ఎల్లారం గ్రామాలలో సర్పంచ్ పదవికి ఇద్దరేసి అభ్యర్థులు పోటీలో ఉండగా ఆత్మకూర్, ఎనికేపల్లి, ఏటిగడ్డసంఘం, గొల్లగూడెం, కోనాపూర్, మాచిరెడ్డిపల్లి, మద్దికుంట, నాగసాన్పల్లి, నందికంది, రేజింతల్, సూరారం, వెల్టూర్ గ్రామాలలో ముగ్గురుచొప్పున సర్పంచ్ పదవికి పోటీచేస్తున్నారు. అలాగే ముబారక్పూర్, ముబారక్పూర్(బి), పొట్టిపల్లి వెంకటపూర్ గ్రామాలలో నలుగురుచొప్పున, అంకెనపల్లి, పొట్టిపల్లిలో ఐదుగురు చొప్పున పెద్దాపూర్‌లో ఆరుగురు అభ్యర్థులు, సర్పంచ్‌పదవి కోసమై ఎన్నికలలో పోటీపడుతున్నారు. వీరిలో అధికారం ఎవరికి దక్కుతుందో రేపు సాయంత్రానికల్లా తేటతెల్లమవుతుంది. గ్రామాలలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖవారు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అభ్యర్థులు, ప్రజలు పూర్తిగా సహకరించాలని ఎన్నికల అధికారి ఎంపిడివో లక్ష్మి కోరారు.

## మల్లన్న దేవాలయానికి జిరాక్స్ మిషన్ అందజేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు

**కొమురవెల్లి, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున్ దేవాలయానికి సేవా కార్యక్రమాలలో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు కొమురవెల్లిశాఖ పక్షన రూ.95వేల విలువగల జిరాక్స్ యంత్రాన్ని మంగళవారం అందజేశారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా బ్యాంకు చేపట్టిన సేవా కార్యక్రమంపట్ల భక్తులు సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఎఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, బ్యాంక్ జనరల్ మేనేజర్ సుధాకర్, రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్, ఆర్ఓ సిబ్బంది కిరణ్, రాజేష్, కొమురవెల్లిశాఖ మేనేజర్ సంతోష్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, పృథ్వీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు. దేవాలయానికి జిరాక్స్ మిషన్ అందించిన బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్ హయాంలోనే పల్లెల్లో అభివృద్ధి

-కెసిఆర్ పాలనను గుర్తుచేస్తున్న ప్రజలు...
-గ్రామాలను కాంగ్రెస్ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యంచేసింది...
-మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్‌రెడ్డి



నప్రచారం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, డిసెంబర్ 9, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు మెంబర్లను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలను కోరారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కులేదని పేర్కొన్నారు. మొదటివిడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడానికి మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మండల నాయకులతోకలసి పాపన్నపేట మండలంలోని గాంధారి పల్లి, జయపురం, ఎల్లాపూర్, కొత్తపల్లి, అబ్లాపూర్, ఎన్కెపల్లి, సీతానగర్, కుర్తివాడ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలతో కలసి బతుకమ్మ ఆడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్, వార్డుమెంబర్లను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ పల్లెలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలనలోచేసిన అభివృద్ధిపనులు ఇప్పటికీ జిల్లాలోని గ్రామపంచాయతీల్లో కనిపిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో అధికార పార్టీ నుండి సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులను పెట్టని నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది మెదకే అన్నారు. అధికార పార్టీకి సర్పంచ్ స్థానానికి క్యాండిడేట్లు దొరక్క పోవడంతో బిజెపి పార్టీకి సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్‌పార్టీకి చెందిన కార్యకర్తలను గుంజుకొని అనైతికంగా కండువాలు కప్పుతున్నారని పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకు కొత్త పంచాయతీలను ఏర్పాటుచేయడంతోపాటు తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కెసిఆర్‌ది అని పేర్కొన్నారు.

కెసిఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ పల్లెల్లో కనిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి పాలనలో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. రెండేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల్లో ఎక్కడా అభివృద్ధి జరగలేదు. పంచాయతీలకు రూపాయి నిధులు రాలేదు. మహిళలు, యువతను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటర్లు బుద్ధిచెప్పాలని అన్నారు. ప్రచారంలో మండలపార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జోరందుకున్న పంచాయతీ ఎన్నికల ప్రచారం

-ఇంటింటికి వెళుతూ ఓట్ల అభ్యర్థనలో అభ్యర్థులు



చౌటకూరులో పంచాయతీ ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

**పుల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులు విజయం కోసం గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఈ నెల 14న జరుగనున్న ఎన్నికల్లో తమకు మద్దతుపలకాలని అభ్యర్థిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రమైన చౌటకూరులో కాంగ్రెస్ మద్దతుదారు పార్కల రాంరెడ్డి, బిఆర్ఎస్ మద్దతుదారు ఎండి జాఫర్, కోర్పోల్‌లో కాంగ్రెస్, బిజెపి మద్దతుదారులు హేమలతమహిపాల్‌రెడ్డి, బచ్చుగూడెం సునీతప్రవీణ్‌రెడ్డి, సుల్తాన్‌పూర్‌లో బిఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారులు మన్నె సునీతబాలరాజు, గీతారాణి, పోసానిపల్లిలో కాంగ్రెస్ మద్దతుదారు శేవూరి జ్యోతిరాజులు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లతో తమకు మద్దతుపలకాలని తమదైన శైలిలో అభ్యర్థిస్తున్నారు.

## సామగ్రి పంపిణీలో లోటుపాట్లు ఉండరాదు

-మెదక్ ఆర్డీఓ రమాదేవి



ఎంపిడివో కార్యాలయంలో పరిశీలిస్తున్న ఆర్డీవో

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సూచించారు. మొదటివిడత ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మంగళవారం పాపన్నపేట ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. బుధవారం పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కోసం అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పలు వివరాలు ఆరాతీశారు. అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపిడిఓ విష్ణువర్ధన్, ఎంపిఓ శ్రీశైలం, ఎపిఓ మహిపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

## మంగళపర్తి సర్పంచ్ సుధారామకృష్ణ ఏకగ్రీవం

**వెల్దుర్తి, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండలంలోని మంగళపర్తి గ్రామానికి చెందిన సుధా రామకృష్ణ సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవమయ్యారు. మంగళవారం నాడు విత్డ్రాలు ఉండడంతో పోటీలో ఉన్న అభ్యర్థి రద్దుచేసుకోవడంతో సుధారామకృష్ణ ఒకరే ఉండడంతో ఏకగ్రీవమైనట్టు అధికారి తెలిపారు. అలాగే ఆగ్రామంలో ఏడు, ఎనిమిదవ అభ్యర్థులు ఏకగ్రీవమైనట్టు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన నామినేషన్లు. విత్‌డ్రాల పర్వం

-తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రరెడ్డి



మాట్లాడుతున్న తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి

**వెల్దుర్తి, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో నామినేషన్ల పర్వం, మంగళవారం విత్‌డ్రాల కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపిడివో కార్యాలయంలో నామినేషన్‌కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుగంటల వరకు విత్‌డ్రాలు, అభ్యర్థులకు సింబల్ కేటాయించడం జరుగుతుందని, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచబడతాయని అన్నారు. ఆల్ఫాబెట్స్ ప్రకారం వారికి గుర్తులను కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సైతం ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని అందుకు ఈనెల 17న ఎన్నికల జరగనున్నందున ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకే పోలింగ్ ఉంటుంది. కాబట్టి దీన్ని ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో ఉమాదేవి పాల్గొన్నారు.

## జెఎన్టీయెహెచ్‌లో ఎంఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

**చౌటకూరు, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఈ నెల 12న జెఎన్టీయుహెచ్‌లో ఎంఫార్మసీ కోర్సుకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీతారెడ్డి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంఫార్మసీలో మిగిలిపోయిన ఖాళీలను భర్తీచేయనున్నట్లు, ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు 12న ఉదయం11గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో, నిర్దేశించిన ఫీజుతో హైద్రాబాద్‌లోని కూకట్‌పల్లిలోని జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

## భయంలేకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి

-కొత్తపల్లిలో పోలీస్ కవాత్..



కొత్తపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఓటర్లు అందరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ కోరారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో 50 మందితో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఓటర్లను భయపెట్టే చర్యలకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా, శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సిఐ జార్జ్, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కొల్చారం, మెదక్ రూరల్ ఎస్సైలు అహ్మద్, లింగం తదితరులు పాల్గొన్నారు.